# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 136 క్రిష్ణా, మంగళవారం 10 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మమతల పందిరి సేవలు శ్లాఘనీయం : చలమలశెట్టి







**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** బాపులపాడు మండలం వీరవల్లి వీరవల్లి గ్రామం లో మమతల పందిరి సేవా సమితి అద్వర్యం లో గత 2 సంవత్సరాలుగా దాదాపుగా 173 మందికి కుట్టు మరియు జూట్ బ్యాగుల శిక్షణ కార్యక్రమాలు విజయవంతముగా నిర్వహణ జరుగుతున్నది. నూతనంగా దంటగుంట్ల గ్రామంలో సోమవారం నాడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గన్నవరం నియోజక వర్గ జన సేన పార్టీ పీఓసి చలమలశెట్టి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాయ్ అయన మాట్లాడుతూ..., మమతల పందిరి సేవలు శ్లాఘనీయం అన్నారు. మమతల పందిరి ఇప్పటికే వీరవల్లి గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా 173 మందికి శిక్షణ అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన విషయం అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. మరల ఇప్పుడు దంటగుంట్ల గ్రామ మహిళలు కోరిక మీద ఇక్కడ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం గొప్ప విషయం అని కొనియాడారు. మమతల పందిరి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు లంక రమేష్ మాట్లాడుతూ..., తమ మమతల పందిరి సేవా సమితి ద్వారా ఇప్పటికి 172 సామజిక సేవా కార్యక్రమాలని నిర్వహించామని అలాగే మహిళా స్వావలంబన కై విజయవంతముగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలని నిర్వహించే క్రమంలో దంటగుంట్ల గ్రామ ప్రెసిడెంట్ యజ్ఞవరపు రంగారావు, తెలుగు దేశం పార్టీ మండల నాయకులు దయాల రాజేశ్వరరావు, డీ సి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ల చొరవతో దంటగుంట్ల గ్రామంలో ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందని మరియు వారిని ప్రత్యేకముగా అభినందించారు. మమతల పందిరి కోఆర్డినేటర్ కరకట్ల రాధికా నాయుడు మాట్లాడుతూ..., మమతల పందిరి అద్వర్యం లో వచ్చే జూన్ 25 న ఉదయం 10.44లకు వీరవల్లి గ్రామం లో రాజా రామ్మోహనరావు మరియు బేబీ సరోజినీ దేవి దంపతుల వితరణ సహాయం తో మమతల పందిరి వృద్ధాశ్రమం భూమి పూజ జరగనున్నదని తెలిపారు. ఈ వృద్ధాశ్రమం నిర్వహణ మమతల పందిరి సేవ మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లగలదని ఆశిస్తున్నామని అన్నారు. అనంతరం స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్, రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబ శివరాయల్, ఆశాజ్యోతి మానసిక వికలాంగుల కేంద్రం అధ్యక్షులు శ్రీమతి ఎం. మాధవీలత, వడ్డీల్ల లక్ష్మి కుమారి, వడ్డీ వాసవి, యాజ్ఞవరపు శ్రీనివాస్, బంగారమ్మ తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం లో శిక్షణార్థులు, గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిదానంగా ఊపందుకుంటున్న అభివృద్ధి పనులు



**గన్నవరం, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, అల్లాపురం గ్రామంలో గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశానుసారం, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు నిర్వహణలో, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు మన్నెం శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అల్లాపురం గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న పైపులైనుకు మరమ్మత్తులు నిర్వహించారు. ఎప్పటినుండో ఈ పైపులైను లీక్ అవడంతో గతంలో అధికారులకు, నాయకులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించలేదని, సదరు పైపులైను సమస్య గురించి టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావుకు తెలియపరచగా వెంటనే ఆయన స్పందించి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు తెలియపరచి ఆయన ఆదేశానుసారం, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు సహకారంతో పైపులైను మరమ్మత్తులు సోమవారం నిర్వహించారని మన్నెం శ్రీనివాసరావును పలువురు గ్రామస్తులు కొనియాడారు. అదే విధంగా గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలతో పాటు దళితవాడలో ఉన్న రెండో పక్క డ్రైనేజీని కూడా నిర్మించాలని ఎమ్మెల్యే వెంకట్రావుకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు



**తిరుమల, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు సోమవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరిపై ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. తనను గెలిపించిన గన్నవరం నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కలగాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన శక్తిని, దీవెనలను ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నారు.

## లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా శిక్ష తప్పదు : యార్లగడ్డ





**తిరుమల, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** సినీ నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన 'సంకల్ప యాత్ర' సోమవారం నాటికి తిరుపతికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బండ్ల గణేష్ రాత్రికి అలిపిరిలో బస చేసి, మంగళవారం ఉదయం మెట్ల మార్గం ద్వారా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నారు, ఆపై తన యాత్రను ముగిస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ..., టీటీడీ లడ్డూ కల్తీ అంశంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో ఎంతటి వారు ఉన్నా కూటమి ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని పెద్దలకు తెలియకుండా ఇలాంటి కల్తీ జరిగే అవకాశం లేదని ఆరోపించారు. అప్పటి టీటీడీ బోర్డు కూడా దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. వంద కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆవులు బంగ్లాదేశ్‌కు తరలిపోయాయని సంచలన ఆరోపణలు చేశారు. టీటీడీకి అవసరమైన నెయ్యి కోసం తగినన్ని ఆవులను వృద్ధి చేయాలని ఆయన సూచించారు. వైసిపి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నప్పటికీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారు డైవర్ట్ అవ్వరని పేర్కొన్నారు. అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి ఆస్తులపై కూడా విచారణ జరపాలని ఒక భక్తుడిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. టీటీడీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని, అక్కడ కేవలం హిందువులే ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాగే వైసిపి నాయకులకు తెలుగు భాష నేర్పించాలని, బూతులు మాట్లాడే వారిని జైల్లో పెట్టేలా చట్టాలు రావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రభుత్వం స్మార్ట్ ఆలోచన.. ఈ కార్డులతో అన్ని ప్రయోజనాలా?

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 09 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు. మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.

అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

## బొమ్ములూరు గ్రామంలో ఉచిత మెడికల్ దంత వైద్య సేవలు












**బాపులపాడు, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో సోమవారం జరిగిన ఉచిత మెడికల్ దంత వైద్య సేవలు పిన్నమనేని డెంటల్ మెడికల్ కాలేజీ వారి సౌజన్యం తో దంత వైద్య ప్రొఫెసర్స్ డా మాధురి, డా పల్లవి సమంత, వారి వైద్య సిబంధి చేత ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. సుమారు గా 220 మందికి గాను దంతాలు శుభ్రపరచడం, దంత సమస్యలు చూడటం, అవసరమైనా మందులు ఇవ్వడం, వైద్య సేవలు పూర్తి ఊచితంగా చెయ్యడం జరుగింది. సమస్య తీవ్రత ను బట్టి కొంత మందికి హాస్పిటల్ కి రమ్మని అక్కడ కూడా పూర్తి ఉచితంగా వైద్యం చేసేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీ దయాల రాజేశ్వరరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారితో పాటు ఐజ కోమారెడ్డి రాజేష్, సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్, పార్టీ ప్రెసిడెంట్ వేగే కృష్ణారావు, సెక్రటరీ గొల్లపూడి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గండేపూడి నితీష్, ఉపాధ్యక్షుడు దాసరి రాజేష్ దంత వైద్యులు, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరా, సచివాలయ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

## రహదారి అభివృద్ధి పూర్తి చేసి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తాం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



**తాడిగడప, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం మైనార్టీ సోదరులు ఎక్కువగా ఉండే సనత్ నగర్ ప్రాంతంలో, మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి పనిచేస్తున్నామన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్. రంజాన్ పండుగ సమయానికల్లా నూతన నిర్మాణం పూర్తి చేయడం ద్వారా, ముస్లిం సోదరులకు పండుగ వాతావరణాన్ని కల్పించేలా ప్రత్యేకదృష్టితో పనిచేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమం అభివృద్ధి పట్ల కూటమి నేతలందరం కలిసి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు...

## విశాఖ ఉక్కు: ప్రైవేట్ హస్తాంతరణ వైపు ప్రభుత్వంతో పెద్ద చర్య



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 09 :** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దిశగా మరో కీలక అడుగు వేసింది. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన ఆర్ఐఎన్ఎల్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. అలాగే, కోల్ హ్యాండ్లింగ్ సహా ప్రైవేటు క్యాప్టివ్ పవర్ ప్లాంట్ కోసం కూడా టెండర్లు విడుదలయ్యాయి. ఉక్కు ఉత్పత్తిలో థర్మల్ పవర్ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని ప్రైవేటీకరణ చేయడానికి టెండర్లు ఆహ్వానించడంతో, కార్మిక సంఘాల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ప్రైవేటీకరణ ప్రక్రియలో కీలక విభాగాలను మద్దతు లేకుండా స్వాధీనం చేసుకోవడం వల్ల కార్మికుల తొలగింపు కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. దీనిపై కార్మిక సంఘాలు తీవ్రంగా ప్రతిపాదనలు మరియు ఆందోళనలు ప్రకటిస్తున్నాయి.

# గుడివాడలో ట్రాఫిక్ మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం







**గుడివాడ, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** గుడివాడ టూ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్కెట్ సెంటర్ వద్ద సీఐ జె.ఆర్.కే హరీష్ ట్రాఫిక్ నిబంధనలు మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హరీష్ మాట్లాడుతూ..., ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఓటీపీ షేరింగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి. లోవ రాజు, మహిళా ఎస్ఐ పి. శిరీష, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో నిందితునికి జీవిత కాలపు శిక్ష

**మచిలీపట్నం, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితునికి మరణించెంత వరకు జైలు శిక్ష (జీవిత కాలపు) మరియు రూ.60,000/-లు జరిమానా విధించిన విజయవాడ, పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి వేల్పుల భవానీ. నేరం జరిగి కేవలం 11 నెలల కాలంలో నిందితుడికి శిక్ష పడేలా చేసిన కృష్ణా జిల్లా పోలీసులు. గుడివాడ సబ్ డివిజన్ డిఎస్పి ధీరజ్ వినీల్ కేసును దర్యాప్తు చేసి నిందితుడైన ప్రకాశం జిల్లా, కొండెపి మండలం, పెట్లూరు గ్రామానికి చెందిన కొమ్ము సౌల్ (21 సం.) ను అరెస్ట్ చేసి కోర్ట్ లో కేవలం 60 రోజుల లోపు చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. రాష్ట్ర డి.జి.పి. శ్రీ హరీష్ కుమార్ గుప్తా (ఐ.పి.ఎస్) ఆదేశాల మేరకు ఇటువంటి కేసులను తీవ్ర నేరంగా పరిగణించి కన్వెన్షన్ బేసిడ్ ట్రైల్ మోనిట్రింగ్ పద్ధతిలో త్వరితగతిన ట్రయిల్ ను పూర్తి అయ్యేవిధంగా మరియు నిందితుడికి శిక్ష పడేలాగా చేయాలని అధికారులకు మరియు సి.ఎం.ఎస్. సిబ్బందికి పోలీస్ సూపరింటెండెంట్ విధ్యా సాగర్ నాయుడు (ఐ.పి.ఎస్) ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గుడివాడ సబ్ డివిజన్ డిఎస్పి పర్యవేక్షణ లో పమిడిముక్కల పోలీసు సిబ్బంది మరియు సి.ఎం.ఎస్. సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణలో ఫోక్సో కోర్టు (స్పీడీ ట్రయిల్ కోర్ట్) నందు త్వరితగతిన ట్రయిల్ నిర్వహించడం జరిగింది. విచారణ అనంతరం నిందితుడిపై నేరం ఋజువైనందున సోమవారం విజయవాడ ఫోక్సో కోర్టు జడ్జి వేల్పుల భవానీ నిందితుడు కొమ్ము సౌల్ (21 సం.) కి లి మరణించెంత వరకు జైలు శిక్ష (జీవితకాలపు జైలు శిక్ష) మరియు రూ.60,000/-లు జరిమానా విధించారు. సదరు బాధిత బాలికకు జరిమానా నుండి రూ.30,000/-లు మరియు రూ.5.00,000/- నష్టపరిహారం ఇచ్చేవిధంగా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అధారిటీ వారిని ఆదేశించడం జరిగింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గెద్దం రాజేశ్వర రావు, గుడివాడ సబ్ డివిజన్ వి. ధీరజ్ వినీల్, సి.యమ్.ఎస్. ఇనస్పెక్టర్, మరియు సి.యమ్.ఎస్. సిబ్బంది పర్యవేక్షణలో 24 మంది సాక్షులను విచారించడం జరిగింది. కేవలం పది నెలల కాలంలో కేసు విచారణ పూర్తి చేసి, నిందితుడికి శిక్ష పడటంలో ప్రముఖ పాత్ర వహించి కృషి చేసిన పోలీస్ సిబ్బందిని, పోలీస్ సూపరింటెండెంట్ వి విధ్యా సాగర్ నాయుడు (ఐ.పి.ఎస్) లను అభినందించడం జరిగింది.



# సబ్ రిజిస్ట్రార్ చాకచక్యంతో ఆగిన దొంగ రిజిస్ట్రేషన్




**నూజివీడు, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఆగిపోయిన తనఖా రద్దు దొంగ రిజిస్ట్రేషన్. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు. గతంలో శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో కోటి రూపాయల లోన్ తీసుకున్న తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన అద్దేపల్లి వెంకటరత్నం. శ్రీరామ్ ఫైనాన్స్ కు సంబంధం లేని దొడ్డి నాగరాజు అనే వ్యక్తి లోను క్లియర్ అయిందని నూజివీడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తనఖా రిజిస్ట్రేషన్ ను రద్దు చేయడానికి వచ్చిన వైనం. కోటి రూపాయల లోన్ ఫైనాన్స్ సంస్థకు చెల్లించకుండానే, లోను తీరిపోయినట్లు ఆస్తి తనఖా రద్దు రిజిస్ట్రేషన్ చేసేందుకు దొంగ పత్రాలు అందించిన అద్దేపల్లి వెంకటరత్నం దొడ్డి నాగరాజు. పెద్ద మొత్తంలో లోను రద్దు చేయడానికి తాడేపల్లిగూడెంలో ప్రయత్నం చేయకుండా, నూజివీడు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడంపై అనుమానం వచ్చి శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్ యన్ ఫణి సీతారామరాజు. నకిలీ పత్రాలు, నకిలీ ఆఫీస్ ఐడి కార్డు, నకిలీ స్టాంపులతో రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించిన దొడ్డి నాగరాజు, అద్దేపల్లి వెంకటరత్నం లను కార్యాలయంలో బంధించి పట్టణ పోలీసులకు అప్పగించిన సబ్ రిజిస్ట్రార్ యన్ ఫణి సీతారామరాజు. దొంగ తనఖా రిలీజ్ రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ రైటర్, కొందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది మధ్యలో భారీ మొత్తంలో చేతులు మారినట్లు సమాచారం .

## ఏపీకి మరో మెడికల్ కాలేజీ..ఈఎస్ఐఎస్ ఆస్పత్రిని మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసే ప్రణాళిక

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 09 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. విశాఖపట్నంలోని ఈఎస్ఐఎస్ ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలనే ఆలోచనలో ఉన్న ట్లు ప్రకటించింది. మెడికల్ ఎడ్యుకేషన్‌ను విస్తరించటంతో పాటుగా ఈఎస్ఐ లబ్ధిదారులకు మరింత మెరుగ్గా ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈఎస్ఐ సామాజిక భద్రతా పథకం కింద కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా మెడికల్ ఎడ్యుకేషన్, ఆరోగ్య సేవలను విస్తరించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఎంప్లాయిమెంట్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ దేశవ్యాప్తంగా పది ఈఎస్ఐ/ఈఎస్ఐఎస్ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలుగా మార్చాలని భావిస్తోంది. ఇందులో విశాఖపట్నం కూడా ఉంది. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా.. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి శోభా కరంద్లాజే ఈ విషయాన్ని వెల్లడించారు. జాతీయ వైద్య మండలి విధానాలకు అనుగుణంగా ఈ అప్‌గ్రేడేషన్ ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్పత్రులను అధికారికంగా ఈఎస్ఐసీకి అప్పగించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖపట్నంలోని ఈఎస్ఐఎస్ ఆస్పత్రిని, ఏపీ ప్రభుత్వం ఈఎస్ఐసీకి అప్పగించడం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య రంగ సేవలను విస్తరించేందుకు ఈఎస్ఐసీ సంస్కరణలు అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను ఈఎస్ఐసీ నెట్‌వర్క్‌తో అనుసంధానించడంపైనా ప్రణాళికలు రచిస్తున్నారు.




ఇక విశాఖపట్నం వంటి పారిశ్రామిక నగరాలకు.. తాజాగా తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు విశాఖపట్నంలోని ఈఎస్ఐఎస్ ఆస్పత్రిని మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం జనవరిలో విశాఖలో పర్యటించింది. మరోవైపు ఈఎస్ఐఎస్ ఆస్పత్రిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఈఎస్ఐసీకి అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది. స్టాఫ్, నిర్వహణ ఖర్చులు వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర అధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం విశాఖలోని ఈఎస్ఐఎస్ ఆస్పత్రి 200 పడకల సామర్థ్యంతో నడుస్తోంది. షీలానగర్‌లో 400 పడకల సామర్థ్యంతో ఈఎస్ఐసీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. దీని నిర్మాణం పూర్తి అయితే కార్మికులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

# కుక్కల గురించి మాట్లాడతారు, పిల్లల గురించి మాట్లాడరా




**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 09 :** తెలుగు రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా వీధి కుక్కల సంరక్షణ అంశం హాట్‌టాపిక్ అయ్యింది. కొందరు సెలబ్రిటీలు వీధి కుక్కల్ని సంరక్షించాలని బాధ్యత ఉందని కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు మాత్రం వీధి కుక్కలు మనుషుల, పిల్లలపై దాడి చేస్తుంటే వాటిని ఎలా సంరక్షిస్తారని ప్రశ్నిస్తున్నారు. శునకాల గురించి డిబేట్ జరుగుతున్న వేళ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల ట్వీట్ హాట్‌టాపిక్ అయ్యింది. కుక్కల సంరక్షణ గురించి మాట్లాడే సెలబ్రిటీలు.. గిరిజన బిడ్డల గురించి ఎందుకు మాట్లాడం లేదు అంటూ ట్వీట్ చేశారు. 'కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం!. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉడకని ఇడ్లీ , నిల్వ చట్నీ.. 89 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 70 మందికి చికిత్స.. ఒకే మంచంపై నలుగురైదుగురికి సెలైన్లు. ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం మోగుతున్నా.. తీరు మారని బాబు సర్కారు.. గిరిజన విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం. కూటమి అధికారం చేపట్టాక ఏపీలో ఇప్పటివరకు సరైన ఆహారం , మంచినీరు , వైద్యం లేక.. 50 మంది వరకు మరణించారు.. వందలమంది అనారోగ్యం బారిన పడ్డారు. దీనిపై ఏ మీడియాలోనూ చర్చలు జరగవు.. ఏ మేధావులూ మాట్లాడరు. కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం' అంటూ ట్వీట్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిది ఆరె శ్యామల ట్వీట్ పరోక్షంగా.. సినీ నటి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ సతీమణి రేణూదేశాయ్ కుక్కల సంరక్షణ గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యల్ని పరోక్షంగా ప్రస్తావించారా అనే చర్చ జరుగుతోంది. కుక్కల్ని సంరక్షించాలని బలంగా వాయిస్ వినిపిస్తున్న వాళ్లు గిరిజన పిల్లలు, వారి సమస్యల గురించి ఎందుకు మాట్లాడటం లేదని శ్యామల ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కల్ని చంపడంపై రేణూ దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత హక్కుల కోసం పోరాటం చేయలేదన.. కానీ కుక్కల విషయంలో మాత్రం తన పోరాటం ఆగదు అన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల జరిగిన ఘటనలతో కుక్కల్ని చంపాలనడం సరికాదన్నారు. పోలవరం జిల్లా దేవరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యింది. శనివారం రోజు ఇడ్లీలు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు.. వెంటనే మొత్తం 89మందిని ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరు కోలుకోవడంతో తిరిగి స్కూల్‌కు పంపించారు.. మిగిలినవారు ఆస్పత్రిలో ఉన్నారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి ఇడ్లీ రవ్వ, శనగపిండి కారణమి తేల్చారు.. గడువు ముగిసిన వాటితో ఫుడ్ తయారు చేయడమే కారణం అంటున్నారు. ఈ వ్యవహారంలో స్కూల్ వార్డెన్, వంటమనిషిని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు.. విచారణ జరుగుతోంది. మరోవైపు దేవరపల్లి స్కూల్‌లో విద్యార్థులు అస్వస్థకు గురైన ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.. అధికారులతో సమీక్ష చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి.. తనకు నివేదించాలని ఆదేశించారు. అధికారులు పరిస్థితిని సీఎంకు వివరించారు. ఆరె శ్యామల కూడా ఈ ఘటనను ప్రస్తావిస్తూ ఈ ట్వీట్ చేశారు.

# మాజీ మంత్రి అంబటికి మరో షాక్.. ఒక దాని వెంట మరొకటి

**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 09 :** మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబుకు మరో షాక్ తగిలింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబు ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఎదుట హాజరుపర్చగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అంబటి రాంబాబును రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. అంబటి రాంబాబు ప్రస్తుతం రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే తాజాగా మరో కేసులో అంబటి రాంబాబుకు కోర్టు రిమాండ్ విధించింది. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ గతంలో ఆ పార్టీ పలు నిరసనలు కూడా చేసింది. ఈ క్రమంలోనే మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 2025 నవంబర్ 12వ తేదీ అంబటి రాంబాబు నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. అయితే ఆందోళన సందర్భంగా అంబటి రాంబాబు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై గుంటూరులోని పట్టాభిపురం పోలీసులు అంబటి రాంబాబు మీద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోసం అంబటి రాంబాబును రాజమహేంద్రవరం నుంచి పీటీ వారెంట్‌పై గుంటూరు కోర్టుకు తరలించారు. గుంటూరులోని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన న్యాయమూర్తి అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ విధించారు. మరోవైపు అంబటి రాంబాబు బెయిల్ పిటిషన్, పోలీసుల కస్టడీ పిటిషన్ మీద



న్యాయస్థానంలో విచారణ జరగనుంది. అనంతరం రాజమండ్రి జైలుకు అంబటి రాంబాబును తరలించే అవకాశాలు ఉన్నాయి. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అంబటి రాంబాబుపై ఇటీవల తెలుగు దేశం శ్రేణులు భగ్గుమన్నాయి. గుంటూరులోని ఆయన నివాసం వద్ద ఆందోళన నిర్వహించాయి. ఈ క్రమంలోనే గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటిపైనా, ఆయన వాహనాలపైనా దాడి జరిగింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపైనా గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

# తలసరి ఆదాయంలో టాప్ స్థూల ఉత్పత్తిలో కూడా అగ్రస్థానంలో విశాఖ జిల్లా

**నిధుల వినియోగం 84 శాతం**

**డ్రోన్ల వినియోగంలో చివరి స్థానం**

**ప్రభుత్వ పనితీరు సూచికల్లో గాజువాక నియోజకవర్గానికి ఏం గ్రేడ్**

**అమరావతి నుంచి ముఖ్యమంత్రి సమీక్ష**

**విశాఖలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం ఏర్పాటుచేయాలని సూచన**

**ఎమ్యూజ్‌మెంట్ పార్కుకు 75 ఎకరాలు**

**మార్చి నెలాఖరుకు పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తవుతాయన్న అధికారులు**



**క్రైం కౌంటర్ న్యూస్,** విశాఖపట్నం, ఫిబ్రవరి 9 తలసరి ఆదాయంలో విశాఖపట్నం జిల్లా అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులలతో ఆయన సోమవారం అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్లు వర్చువల్‌గా జిల్లాల నుంచే సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం అన్ని శాఖల పనితీరు, పథకాల వినియోగం, కొత్త పరిశ్రమల పరిస్థితి, పర్యాటక ప్రాజెక్టులు, తదితర అంశాలన్నీ చర్చకు వచ్చాయి.

జిల్లాల స్థూల ఉత్పత్తిలో గత ఏడాది విశాఖ జిల్లా రూ.1,44,192 కోట్లతో ప్రథమ స్థానంలో ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కూడా రూ.1,60,771 కోట్లతో మొదటి స్థానాన్ని నిలుపుకొంది. అలాగే గత ఏడాది జిల్లాల తలసరి ఆదాయంలో విశాఖపట్నం రూ.5,91,104తో అగ్రస్థానంలో ఉండగా, ఈ ఏడాది కూడా రూ.6,58,091తో అదే స్థానంలో నిలిచింది. పరిశ్రమల ఏర్పాటులో రూ.54,253 కోట్లతో జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. అనకాపల్లి జిల్లా మూడో స్థానం దక్కించుకుంది.

రాష్ట్రంలో టీనేజ్ పిల్లల ప్రసవాలు అత్యధికంగా 15 శాతం వరకు ఉండగా ప్రభుత్వం వాటిని ఐదు శాతానికి తేవాలని నిర్దేశించింది. విశాఖ జిల్లా 3.98 శాతంతో మెరుగ్గా ఉంది.

- జిల్లాలో 113 సివిల్ వర్కులు జరుగుతుండగా వాటిలో 36 మాత్రమే పూర్తి కాగా, మరో 63 ప్రాసెస్‌లో ఉన్నాయి. 14 పనులు ఇంతవరకు మొదలు కాలేదు.
- పోలవరం ఎడమ కాలువ పనులు 87 శాతం పూర్తయ్యాయని, మార్చి నెలాఖరుకు మొత్తం పూర్తయిపోతుందని అధికారులు పేర్కొన్నారు.
- ప్రభుత్వ పనితీరు సూచికల్లో (కేపీఎల్ఎస్) గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం 72 అంశాల్లో 92 శాతం స్కోరుతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించింది.
- సీ ప్లేన్లు నడపడానికి ఎంపిక చేసిన విశాఖపట్నం, లంబసింగి, అరకు ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.
- విశాఖలో అతి పెద్ద ఎమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు తక్షణం 75 ఎకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్‌కు ఆదేశించారు.
- మే ఫెయిర్ సంస్థకు పర్యాటకాభివృద్ధి కోసం ఇచ్చిన భూమి విషయంలో ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ భూమి చూడాలని సూచించారు.
- స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌లో ఐటీ, ఫార్మా సెజ్‌లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్వహించాలని ఆదేశించారు. ఎగుమతులు పెంచాలన్నారు.
- రిజిస్ట్రేషన్ల శాఖ విశాఖలో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన గంటలో డాక్యుమెంట్ ఇవ్వాలని సూచించారు. 24 గంటలు దాటితే కొరియర్‌లో ఇంటికి పంపాలన్నారు.
- జిల్లాకు రూ.319 కోట్ల నిధులు అందుబాటులో ఉండగా, వాటిలో 84శాతం అంటే రూ.269 కోట్లు వినియోగించుకున్నట్టు అధికారులు వెల్లడించారు.
- ఇతర జిల్లాలతో పోల్చుకుంటే విశాఖట్నం జిల్లా డ్రోన్ల వినియోగం చివరి స్థానంలో నిలిచింది.

# మహిళా సాధికారతే లక్ష్యం : కానూరి శేషు మాధవి

## బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా ఎంపిక...



**గన్నవరం, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శిగా గన్నవరం ప్రాంతానికి చెందిన శ్రీమతి కానూరి శేషు మాధవి ని పార్టీ నియమించింది. పార్టీ పట్ల అంకిత భావం, క్రమశిక్షణతో సామాజిక సేవలు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో చురుకుగా పనిచేసిన ఆమెకు రాష్ట్ర పార్టీ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసిన శేషు మాధవి రాజకీయాలు, సామాజిక సేవల్లో నిత్యం ప్రజల్లోనే ఉండి సేవలందిస్తున్నారు. ఈ నియామకంపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమతి కానూరి శేషు మాధవి మాట్లాడుతూ..., తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, సంఘటన మంత్రి మధుకర్, కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి నిషిదా రాజ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు : కూటమి నేతలు



**పెనమలూరు, ఫిబ్రవరి 09 (క్రైం కౌంటర్ ప్రతినిధి) :** పెనమలూరు నియోజకవర్గం, పోరంకి తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సహకారంతో చిరువ్యాపారులైన ఇద్దరు పేదమహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే విధంగా ఉచితంగా తోపుడుబండ్లు అందచేసిన కూటమి నేతలు. పెనమలూరు నియోజకవర్గంలో ఆర్థికంగా వెనుకబడినవర్గాల ప్రజలు ఎక్కువగా ఉండటంతో, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వివిధ రూపాలలో పేదప్రజలకు ఆర్థిక చేయూత కల్పించేలా ప్రణాళికలు రూపొందించుకుని, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్న తాడిగడప మున్సిపాలిటీ తెదేపా అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు మండల అధ్యక్షులు కోయా ఆనంద్ ప్రసాద్,దేవినేని రాజా,అంగిరేకుల మురళి, సోమవారం ఉదయం పోరంకి తెదేపా కార్యాలయంలో ఇరువురి మహిళలకు చిరువ్యాపారం చేసుకునేందుకు వీలుగా తోపుడుబండ్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# రూఫ్‌టాప్ సోలార్ అమరికలో ఇబ్బందులు

పలు అంశాలపై 48 మంది కాల్

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పృథ్వీతేజ్ హామీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు'ల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని, ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినియోగదారులు పలువురు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు ఫిర్యాదు చేశారు. ఏపీఈపీడీసీఎల్ సోమవారం నూతనంగా ప్రారంభించిన 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమానికి తొలిరోజు 48 మంది వినియోగదారులు ఫోన్ చేసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిలో ఎడతెగని జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అంచనాలు ఇవ్వడంలో ఇక్కట్లు, విద్యుత్ లైన్ల మార్పు, స్తంభాల మార్పిడి, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, సరఫరాలో అంతరాయాలు వంటి అంశాలపై ఫిర్యాదు చేశారు. సీఎండీ పృథ్వీతేజ్ ఫిర్యాదులన్నీ నమోదు చేసుకున్నామని, త్వరితంగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. వీటన్నింటినీ కార్పొరేట్ కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదని, సమస్య వచ్చిన వెంటనే 1912కు ఫోన్ చేసి చెప్పవచ్చునని, లేదంటే 9493681912 వాట్సాప్ నంబరుకు చాటింగ్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాశ్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం విజయలలిత, జీఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## సినిమాలకు భారీ సెట్స్..

తెలుగు సినిమా ప్రపంచంలో సక్సెస్ ఫుల్ దర్శకులలో డైరెక్టర్ గుణశేఖర్ ఒకరు. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం యుఫోరియా సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 6న విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తుంది. ఇందులో భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగ ఓ ఇంటర్వ్యూలో గుణశేఖర్ మాట్లాడుతూ తన సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే సినిమా కోసం తాను వేసే భారీ సెట్స్ గురించి.. ఆ సమయంలో మహేష్ తనకు ఇచ్చిన సున్నితమైన హెచ్చరిక గురించి బయటపెట్టారు. మహేష్ మాటలు తనను ఎంతో మార్చాయని అన్నారు.చూడాలని ఉంది, ఒక్కడు, అర్జున్, సైనికుడు ఇలా ప్రతి సినిమాకు భారీ సెట్స్ వేశారు గుణశేఖర్. అప్పట్లో ఆయన వేసిన సెట్స్ ట్రెండ్ సెట్టర్ అనే చెప్పాలి. వరుసగా సెట్స్ వేస్తూ సినిమాలు తీయడం తనను దెబ్బ కొట్టిందని అన్నారు. ఈ విషయంలో స్టార్ హీరో మహేష్ బాబు సైతం తనను హెచ్చరించారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

గుణశేఖర్ మాట్లాడుతూ.. "భారీ సెట్స్ వేసి సినిమాలు తీయడం నన్ను దెబ్బ కొట్టింది. సైనికుడు సమయంలో వేయి స్తంభాల గుడి సెట్ వేశాం. అప్పటికే ఆ ట్రాప్ లో నేను పడిపోయాను. ఆ సమయంలో మహేష్ బాబు నన్ను హెచ్చరించారు. సెట్స్ భారీగా వేయడం వల్ల అక్కడే ఎక్కువ వర్క్ చేయాలనే ఉద్దేశం పెరుగుతుంది. దీంతో కథ అటు వైపు తిరుగుతోందని అనిపిస్తుందని మహేష్ చెప్పారు. ఆలోచిస్తే అది నిజమే అనిపించింది. సెట్ వేశాం కాదని అక్కడే ఎక్కువగా షూటింగ్స్ చేశాము. దీంతో కథ లిమిట్ మారిపోయింది. మహేష్ మాటలతో రియలైజ్ అయ్యాను. అప్పటి నుంచి సెట్స్ జోలికి వెళ్లలేదు. చూడాలని ఉంది.. ఒక్కడు సినిమాలకు కథ ప్రకారమే వెళ్లాను. ఆ తర్వాతే సెట్స్ ట్రాప్ లో పడ్డాను." అంటూ చెప్పుకొచ్చారు.





## పోషకాల పవర్‌హౌస్..

ఆరోగ్యకరమైన ఆహారంలో ఆకుకూరలకు విశిష్టమైన స్థానం ఉంది. అయితే, వాటిలో పాలకూరది ప్రత్యేకమైన స్థానం. ఇది రుచిగా ఉండటమే కాకుండా, మన శరీరానికి అవసరమైన అనేక రకాల పోషకాలను అందిస్తుంది. అందుకే.. పాలకూరను ఒక దివ్యమైన ఆహార ఔషధంగా పరిగణించవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఇది శరీరానికి కావాల్సిన అన్ని విటమిన్లు, ఖనిజాలకు నిలయం.. పాలకూరలో ఐరన్, కాల్షియం, ఫైబర్, విటమిన్లు, పొటాషియం వంటి పోషకాలు దాగున్నాయి.. పాలకూర అందించే అద్భుతమైన పది ఆరోగ్య ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం..

పాలకూర టాప్ 10 ప్రయోజనాలు..

ఐరన్ (ఇనుము): ఈ రోజుల్లో చిన్న, పెద్ద అందరిలోనూ ఐరన్ లోపం సాధారణమైపోయింది. రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఐరన్ అత్యంత కీలకం. 100 గ్రాముల పాలకూరలో 2.7 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది, ఇది రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది.

కాల్షియం: ఎముకలు, దంతాల ఆరోగ్యానికి కాల్షియం అత్యవసరం. ముఖ్యంగా మహిళలకు, పెరిగే పిల్లలకు, వృద్ధులకు ఇది చాలా ముఖ్యం. 100 గ్రాముల పాలకూర ద్వారా 99 మైక్రోగ్రాముల కాల్షియం అందుతుంది. గర్భస్థ శిశువుల ఎముకల పెరుగుదలకు కూడా ఇది అవసరం.

ఫైబర్ (పీచుపదార్థం): జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఫైబర్ ఎంతో అవసరం. ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది.. గ్లూకోజ్‌ను స్థిరంగా విడుదల చేస్తుంది. పాలకూరలో క్యాలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. 100 గ్రాముల పాలకూరలో 2.2 గ్రాముల ఫైబర్ ఉంటుంది.

పొటాషియం: శరీరంలోని అనేక జీవక్రియలు సక్రమంగా జరగడానికి పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో, కండరాల నొప్పులను నివారించడంలో, గుండె జబ్బుల నివారణలో ఇది తోడ్పడుతుంది. ముఖ్యంగా పోస్ట్ మెనోపాజ్ దశలోని మహిళలకు ఇది చాలా అవసరం. 100 గ్రాముల పాలకూరలో 558 మిల్లీగ్రాముల పొటాషియం లభిస్తుంది.

ఫోలేట్: సంతానం కోసం ప్రయత్నిస్తున్న వారికి, గర్భిణీలకు ఫోలేట్ చాలా అవసరం. గర్భస్థ పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి ఇది కీలక పోషకం. శిశువు మెదడు, వెన్నుముక సరైన అభివృద్ధికి ఫోలేట్ ప్రధానం. 100 గ్రాముల పాలకూరలో 165 మైక్రోగ్రాముల ఫోలేట్ ఉంటుంది.

విటమిన్ ఎ: కంటి చూపును మెరుగుపరచడంలో, చర్మాన్ని మెరిపించడంలో, జుట్టు పెరుగుదలకు విటమిన్ ఎ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. 100 గ్రాముల పాలకూర ద్వారా 141 మైక్రోగ్రాముల విటమిన్ ఎ లభిస్తుంది.

విటమిన్ సి: ఇది గొప్ప యాంటీఆక్సిడెంట్. రోగనిరోధక శక్తిని పెంచి, గాయాలను నయం చేయడానికి సహాయపడుతుంది. విటమిన్ సి పూర్తి ప్రయోజనం పొందాలంటే పాలకూరను ఎక్కువ సేపు ఉడికించకూడదు. 100 గ్రాముల పాలకూరలో 28.1 మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది.

విటమిన్ కె: వెన్నునొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలను నివారించడంలో విటమిన్ కె ప్రధాన పాత్ర పోషిస్తుంది. 100 గ్రాముల పాలకూరలో 482.9 మైక్రోగ్రాముల విటమిన్ కె ఉంటుంది.

సోడియం: కండరాలు, నాడీ వ్యవస్థ పనితీరుకు సోడియం అవసరం. శరీరంలో సోడియం తక్కువగా ఉంటే తలనొప్పి, కండరాల బలహీనత వంటివి వస్తాయి. 100 గ్రాముల పాలకూరలో 79 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది.

మెగ్నీషియం: హార్మోన్ల నియంత్రణ, ఎముకల ఆరోగ్యం, కాల్షియం శోషణ వంటి వాటికి మెగ్నీషియం అవసరం. 100 గ్రాముల పాలకూరలో 79 మైక్రోగ్రాముల మెగ్నీషియం లభిస్తుంది.

ఇలా పాలకూర ఒక మల్టీవిటమిన్ క్యాప్సూల్ కంటే గొప్పగా పనిచేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, కిడ్నీ స్టోన్స్ (మూత్రపిండాల్లో రాళ్లు) వచ్చే అవకాశం ఉన్నవారు పాలకూర వినియోగాన్ని తగ్గించుకోవాలి. మిగతా అందరూ తమ ఆహారంలో పాలకూరను చేర్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



## ఆసుపత్రి మెట్లు ఎక్కడం ఎందుకు...?

నేటి వేగవంతమైన జీవితంలో మనకు చిన్న తలనొప్పి వచ్చినా లేదా కడుపులో అసౌకర్యంగా అనిపించినా వెంటనే మందు మాత్రలు మింగే అలవాటు మనకు ఏర్పడింది. అయితే, ప్రతి చిన్న విషయానికి ఇంగ్లీష్ మందులపై ఆధారపడటం వల్ల కాలక్రమేణా శరీర సహజ రోగనిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే, ప్రతి చిన్న విషయానికి ఇంగ్లీష్ మందులపై ఆధారపడటం వల్ల కాలక్రమేణా శరీర సహజ రోగనిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మన ప్రకృతిలో, మన ఇళ్ల చుట్టూ అనేక రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్య నిపుణుల ప్రకారం, ప్రతిరోజూ కొన్ని ప్రత్యేకమైన ఆకులను నమలడం వల్ల అనేక దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందని నమ్ముతారు.

బొప్పాయి ఆకులు:

## టీ20 ప్రపంచ కప్ హిస్టరీలో టీమిండియాకు ఊహించని షాక్.

సందడి మొదలైంది. దాదాపుగా అన్ని జట్లు తమ తొలి మ్యాచ్ లను పూర్తిచేశాయి. అయితే, అసలు ఐసీసీ టీ20 ప్రపంచకప్ హిస్టరీలో టాప్ 10 బౌలర్ల గురించి మాట్లాడితే.. ఈ విషయంలో భారత జట్టుకు భారీ షాక్ తగలింది. ఎందుకంటే, ఈ లిస్ట్ లో ఒకే ఒక్క ప్లేయర్ చోటు దక్కించుకున్నాడు. ఆ వివరాలు ఏంటో ఓసారి చూద్దాం..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ తొలి ఎడిషన్ 2007లో జరిగింది. ఈ ఏడాది భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఈ మెగా టోర్నీని నిర్వహిస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన అన్ని ప్రపంచకప్ లలో భారత ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా బ్యాటర్ల విషయానికి వస్తే భారత జట్టుకు తిరుగులేదు. కానీ, బౌలర్ల విషయానికి వస్తే మాత్రం కచ్చితంగా ప్రశ్నించుకోవాల్సిందే. ఎందుకంటే, టాప్ 10లో ఒక్క ప్లేయర్ కూడా లేకపోవడం గమనార్హం. టీ20 ప్రపంచకప్ హిస్టరీని ఓసారి పరిశీలిస్తే.. అత్యంత విజయవంతమైన బౌలర్లలో టాప్ 5 లిస్ట్ లో ఆసియా నుంచే ఉన్నారు. కానీ, వీరిలో ఒక్కరు కూడా భారత జట్టు నుంచి లేకపోవడం గమనార్హం. ఇక ఈ ఏడాది టోర్నమెంట్ లో మెరుగైన ప్రదర్శన చేస్తే ఆసీస్ బౌలర్ ఆడమ్ జంపాతోపాటు సౌతాఫ్రికా బౌలర్ అన్రిక్ నార్జే టాప్ 5లో చోటు దక్కించుకోవచ్చు.

అర్షదీప్ సింగ్ టాప్ 5లో చేరే ఛాన్స్..

టీమిండియా ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ టాప్ 10లో చేరే ఛాన్స్ ఉంది. మెరుగైన ప్రదర్శన చేస్తే కచ్చితంగా టాప్ 5లో ఉంటాడు. ప్రస్తుతం ఈ టీమిండియా లెఫ్ట్ హ్యాండ్ బౌలర్ 19వ స్థానంలో నిలిచాడు. ఇప్పటి వరకు 15 మ్యాచ్ లు ఆడిన అర్షదీప్ 29 వికెట్లతో 19వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు. ఇక టీమిండియా తరపున అత్యంత విజయవంతమైన బౌలర్ గురించి మాట్లాడితే రవిచంద్రన్ అశ్విన్ ఒక్కడే ఉన్నాడు. అశ్విన్ 24 మ్యాచ్ ల్లో 32 వికెట్లు పడగొట్టి 13వ స్థానంలో నిలిచాడు. బంగ్లాదేశ్ బౌలర్ షకీబ్ అల్ హసన్ 43 మ్యాచ్‌ల్లో 50 వికెట్లతో తొలి స్థానంలో నిలిచాడు. అలాగే శ్రీలంకకు చెందిన వానిందు హసరంగా 40 వికెట్లతో (20 మ్యాచ్‌ల్లో) రెండో స్థానంలో నిలిచాడు. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది 34 మ్యాచ్‌ల్లో 39 వికెట్లతో 3వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు. ఇక ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ 38 వికెట్ల(24 మ్యాచ్‌ల్లో)తో నాల్గవ స్థానంలో నిలిచాడు. ఇక ఐదవ స్థానంలో శ్రీలంక మాజీ ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ 38 వికెట్ల(31 మ్యాచ్‌ల్లో)తో నిలిచాడు.

టీ20 ప్రపంచకప్ 2026లో పోటీ తీవ్రం..

కంగారు బౌలర్ ఆడమ్ జంపా 36 వికెట్లతో 6వ స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది టోర్నమెంట్ లో అద్భుత ప్రదర్శన చేస్తే కచ్చితంగా టాప్ 5లో నిలిచే ఛాన్స్ ఉంది. ఆ తర్వాతి స్థానంలో పాకిస్తాన్ మాజీ బౌలర్ సయీద్ అజ్మల్ (23 మ్యాచ్‌ల్లో 36 వికెట్లు) నిలిచాడు. న్యూజిలాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీ (25 మ్యాచ్‌ల్లో సౌథీ 36 వికెట్లు) ఎనిమిదో స్థానంలో ఉండగా.. దక్షిణాఫ్రికాకు చెందిన అన్రిచ్ నార్జే (19 మ్యాచ్‌ల్లో 35 వికెట్లు) తొమ్మిదో స్థానంలో నిలిచాడు. పదో స్థానంలో శ్రీలంకకు చెందిన అజంతా మెండిస్ (21 మ్యాచ్‌ల్లో 35 వికెట్లు) నిలిచాడు.




## సూర్యతో షేక్‌హ్యాండ్..

టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. ఈ నెల 15న కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌పై పాకిస్తాన్ తీసుకున్న బాయ్‌కాట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కీలక పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ప్రతినిధులు పాకిస్తాన్‌కు చేరుకుని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ నఖ్వీతో అత్యవసర సమావేశం నిర్వహించారు. లాహోర్‌లో జరిగిన ఈ సమావేశంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాం కూడా పాల్గొన్నారు. ఈ చర్చల ద్వారా వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ అత్యవసర బేటీలో, పాకిస్తాన్ తన బహిష్కరణను తప్పించేందుకు కొన్ని షరతులను ఐసీసీ ముందు ఉంచినట్లు సమాచారం. పీసీబీ ఛైర్మన్ నఖ్వీ ఐసీసీకి మూడు ప్రధాన డిమాండ్లను సమర్పించారు. మొదటిది, పాకిస్తాన్‌కు వార్షిక నిధులు పెంచడం. ఇది పాకిస్తాన్ క్రికెట్ అభివృద్ధికి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు అవసరమని పీసీబీ భావిస్తోంది. రెండవది, భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను తిరిగి ప్రారంభించేందుకు ఐసీసీ సహకారం అందించాలని పీసీబీ కోరింది. ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు మెరుగుపడటానికి ఇది కీలకమని పీసీబీ వాదన. మూడవది, భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లలో ఆటగాళ్ళు సంప్రదాయ హ్యాండ్ షేక్‌లను పాటించాలని నఖ్వీ కోరారు. గతంలో ఆసియా కప్‌లో చోటు చేసుకున్న నో హ్యాండ్ షేక్ ఘటనను ఈ సందర్భంగా నఖ్వీ ప్రస్తావించినట్లు తెలుస్తుంది. అన్నింటి కంటే హ్యాండ్ షేక్ డిమాండ్ నఖ్వీ పర్సనల్ అని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అటు ఈ సమావేశంలో బంగ్లాదేశ్ కూడా తన డిమాండ్లను వెల్లడించింది. బీసీబీ ఐసీసీ నుంచి ఆర్థిక పరిహారం ఇవ్వాలని కోరింది. అదనంగా, భవిష్యత్తులో ఒక అంతర్జాతీయ టోర్నమెంట్ నిర్వహణ హక్కులు తమకు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ముఖ్యంగా 2028 అండర్-19 ప్రపంచకప్ నిర్వహణపై బంగ్లాదేశ్ ఆసక్తి చూపినట్లు సమాచారం. కాగా, ఈ కీలక అంశాలపై రెండు, మూడు రోజుల్లోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com